క్లుప్తంగా

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వనమా

సుజాతనగర్: స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శనివారం ధ్వజస్తంభం, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమాలకు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, టీపీసీసీ సభ్యుడు ఎడవల్లి కృష్ణ వేర్వేరుగా హాజరయ్యారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, సొసైటీ చైర్మన్ మండె వీరహనుమంతరావు, ఊకంటి గోపాలరావు, లింగం పిచ్చిరెడ్డి, ఎంపీటీసీ మూడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

యాదవుల కమిటీ ఎన్నిక



చెన్నబోయిన రవి

సుజాతనగర్: అఖిల భారత యాదవ మహాసభ శనివారం వేపలగడ్డ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెన్నబోయిన రవి, ఉపాధ్యక్షుడిగా కన్నబోయిన మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా బొల్లు భాస్కర్, కోశాధికారిగా జంగిలి వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శిగా చెన్నబోయిన ప్రశాంత్, సంయుక్త కార్యదర్శిగా చెన్నబోయిన భానుప్రసాద్, గౌరవ అధ్యక్షుడిగా చెన్నబోయిన హుస్సేన్‌ను ఎన్నుకున్నారు.

జ్యుడీషియల్ ఎంప్లాయీస్ కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కొత్తగూడెంటౌన్: జిల్లా కోర్టు ఆవరణలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జ్యుడీషియల్ ఎంప్లాయీస్ అడక్ కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామిశెట్టి రమేష్, కార్యదర్శిగా డికొండ రవికుమార్‌లను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా నిర్మల మల్లికార్జున్, ట్రెజరరీ లగడపాటి సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీరంగం రామకృష్ణ, మహిళా ప్రతినిధిగా జి.ప్రమీల తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రామిశెట్టి రమేష్ మాట్లాడుతూ.. జ్యుడీషియల్ ఎంప్లాయిస్‌లో నెలకొన్న సమస్యల సాధనకు కృషి చేస్తామన్నారు. ఈ కమిటీ ఎన్నికల్లో జిల్లా న్యాయశాఖ ఉద్యోగులందరూ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



సీడీపీఓ నిర్మల జ్యోతిని సన్మానిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

జూలూరుపాడు: పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పిల్లలు, గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ చంద్రుగొండ ప్రాజెక్టు సీడీపీఓ నిర్మల జ్యోతి అన్నారు. శనివారం కొమ్ముగూడెం సెక్టార్ సమావేశం కాకర్ల-3 అంగన్‌వాడీ కేంద్రం, పాపకొల్లు సెక్టార్ సమావేశం పాపకొల్లులో నిర్వహించారు. కాకర్ల అంగన్‌వాడీ కేంద్రంలో నిర్మల జ్యోతి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సీడీపీఓ నిర్మలజ్యోతిని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు సన్మానించారు.

వితరణ

జూలూరుపాడు: మండలం కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రానికి అదే గ్రామానికి చెందిన బాదావత్ నాగేశ్వరరావు, ప్రియాంక దంపతులు శనివారం ఇనుప బీరువాను వితరణ చేశారు. సుమారు రూ.5 వేల విలువ గల బీరువాను ఐసీడీఎస్ చంద్రుగొండ ప్రాజెక్టు సీడీపీఓ సీహెచ్ నిర్మలజ్యోతికి అందజేశారు. అదేవిధంగా గ్రామ సర్పంచ్ బానోత్ నరసింహారావు ఐదు ప్లాస్టిక్ చైర్లు, పి.సారథి, హరిప్రసాద్, బి.రాంబాబు చిన్నారుల కోసం 12 కుర్చీలు, గుగులోత్ శ్రీను వాటర్ క్యాన్ ఇచ్చారు. కార్యక్రమంలో జూలూరుపాడు వైస్ ఎంపీపీ గాదె నిర్మల, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజాత, అంగన్‌వాడీ టీచర్ సీతామహాలక్ష్మి, దాతలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తిలో జేకే-5 ఓసీ ఆదర్శం

- 63 రోజుల ముందే లక్ష్యం పూర్తి
- ఉద్యోగులను అభినందించిన జీఎం
- ఇదే స్ఫూర్తి కొనసాగించాలని సూచన



జేకే-5 ఓసీ గని కార్యాలయం

ఇల్లెందు: బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనలో ఇల్లెందు ఏరియా జేకే-5 ఓసీ ఈ ఏడాది ఆదర్శంగా నిలిచింది. ఏటా అగ్రస్థానంలో ఉంటున్న ఈ జేకే-5 ఓసీ ఈ దఫా ముందే నిర్దేశిత లక్ష్యాన్ని దాటింది. 63 రోజుల ముందే లక్ష్యాన్ని దాటటం హర్షించదగిన విషయంగా సింగరేణి భావిస్తోంది. 2008లో జేకే ఓసీ-5 ప్రారంభమైంది. 20 లక్షల టన్నులకు గానూ 24.98 లక్షల టన్నులు సాధించి 102 శాతంతో అగ్రస్థానాన్ని పదిలపరుచుకుంది. ఓసీలో 271 మంది ఉద్యోగులు వివిధ రకాల ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఉద్యోగులు, అధికారులు సమష్టి కృషితో ఉత్పత్తి సాధనలో లక్ష్యాన్ని సాధిస్తూ సంస్థను సమున్నతంగా నిలుపుతున్నారు. ఉత్పత్తి కంటే కార్మికులు, ఉద్యోగుల ప్రాణాలకు విలువనిచ్చే ఈ సింగరేణి సంస్థ భద్రతతో కూడిన ఉత్పత్తిని సాధించింది. ఈ జేకే-5 ఓసీలో నేటి వరకు కూడా ప్రమాదాలు లేని ఉత్పత్తిని సాధిస్తూ ముందడుగు వేస్తోంది. సింగరేణి కంపెనీ పరిధిలోని 11 ఏరియాల్లో ఇల్లెందు అగ్రస్థానంలో ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 63 రోజుల ముందే నిర్దేశిత లక్ష్యాన్ని సాధించటంతో పాటు 102 శాతం ఉత్పత్తి సాధించింది. గత ఆర్థిక సంవత్సరం 2021-22 సంస్థ నిర్దేశించిన లక్ష్యం 20 లక్షల టన్నులగాను 24.98 లక్షల టన్నులు ఉత్పత్తి లభించింది. గత సంవత్సరం డిసెంబర్ నెల చివరి నాటికి జేకే-5 నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని అధిగమించింది. 2022-23లో 14.50 లక్షల టన్నులు లక్ష్యం కాగా 14.52 లక్షల టన్నులు జనవరి నాటికి సాధించింది.



బొగ్గు లోడు చేస్తున్న దృశ్యం

ఐక్యతతో ముందుకు సాగుతున్నాం



ఉద్యోగులంతా కలిసి కట్టుగా ఐక్యంగా ముందుకు సాగటం వల్లే ఈ లక్ష్యాన్ని సాధించగలుగుతన్నాము. ఎటువంటి ప్రమాదాలు లేకుండా సంస్థ నిర్దేశించిన లక్ష్యాన్ని ఇచ్చిన గడువులోపు సాధించటం వల్లే జేకే ఓసీకి మంచి గుర్తింపు వస్తోంది. కార్మికులు, ఉద్యోగుల కృషి అభినందనీయం.

– బొల్లం వెంకటేశ్వర్లు పీఓ, జేకే ఓసీ, ఇల్లెందు

సంస్థ మనుగడ కోసం పోరాటం



బొగ్గు బావులకు పుట్టినిల్లు అయిన ఇల్లెందు మనుగడకు ఉద్యోగులు, కార్మికుల సమష్టి కృషి ముంది. సంస్థను కాపాడుకునేందుకు 11 ఏరియాల్లో జేకే ఓసీ అగ్రస్థానంలో నిలిచిందంటే ఉద్యోగులు, అధికారులు, కార్మిక సంఘాలు సంస్థ మనుగడ కోసం పోరాటం చేస్తున్నారు.

– ఎస్.రంగనాథ్, ఉపాధ్యక్షుడు, గుర్తింపు సంఘం, ఇల్లెందు

సమష్టి కృషి ఫలితమే



ఉద్యోగులంతా సమష్టి కృషి వల్లే లక్ష్యాన్ని సాధించగలిగాం. 60 రోజుల ముందే లక్ష్యాన్ని సాధించటం సంతోషం. జేకే-5 ఏరియాకు వెన్నెముకలా నిలిచింది. ప్రమాదాలు లేకుండా ఉత్పత్తి సాధించటం ఉద్యోగులు, అధికారుల కృషి ఫలితమే. ఒకే కుటుంబం.. ఒకే లక్ష్యం.. ఒకే గమ్యం..తో ముందుకు సాగుతున్నాం.

– షాలేమురాజు, ఏరియా జీఎం

గడప గడపకూ 'కాంగ్రెస్'



ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక పాలనకు విసుగు చెందిన ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు చీమల వెంకటేశ్వర్లు అన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో శనివారం మండలంలోని కొత్తూరు గ్రామంలో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రతిఇంటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా చీమల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. దేశ సంపదను కొల్లగొట్టి అప్పులపాలు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుల, గ్యాస్ సిలిండర్ ధర ఆకాశాన్ని అంటడం, ప్రజా సంపదను అదానీ, అంబానీలకు కట్టబెట్టడం, పెట్రోల్, డీజిల్ ధరలు మండిపోవడం ప్రజలకు భారంగా మారాయన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒకే తాను ముక్కలేనని ఆయా పార్టీల మాయమాటలకు ప్రజలు మరోసారి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పులి సైదులు, జలీల్, మోకాళ్ల వెంకటమ్మ, ఊకే కృష్ణ, పగడయ్య, చింత రాంబాబు, మూతి ముత్యాలు, ఊకే అబ్బయ్య, బుచ్చయ్య, ఆదెమ్మ, భద్రయ్య, కాయం లక్ష్మి, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి డైరెక్టర్‌కు సన్మానం



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా రామవరంలోని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం కార్యాలయంలో శనివారం సింగరేణి డైరెక్టర్(పా) అండ్ డైరెక్టర్ ఆపరేషన్స్ ఎస్.చంద్రశేఖర్‌ను ఆ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ మాట్లాడుతూ.. సింగరేణిలో సుదీర్ఘకాలంగా వివిధ హోదాలలో పనిచేసి 2018లో సింగరేణిలో డైరెక్టర్ పదవి చేపట్టారని, ఆ సమయంలో మూతపడిన వీకే-7 కార్మికులను ఇతర ఏరియాలకు బదిలీ కాకుండా ఎంతో మేలు చేసినట్లు చెప్పారు. ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో 11 మెన్ కమిటీ సభ్యులు కాపు కృష్ణ, రీజియన్ సెక్రటరీ కూసన వీరభద్రయ్య, చిలక రాజయ్య, ఎస్కే గౌస్, ఎండీ సత్తార్ పాషా, శనిగరపు శంకర్, నటరాజ్, నర్సింగం, సదానందం, నిమ్మల రాజేశ్వరరావు, జల్లి కిరణ్, వల్లాల శంకర్, లింగాల జోసెఫ్, వెజ్జాల శ్రీనివాస్, డి.శంకర్‌బాబు, నాగమోహన్, రాంసింగ్, ఎం.కొమరయ్య, శంకర్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చెట్టుకిందనే సామాజిక తనిఖీ గ్రామసభ



గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: గ్రామపంచాయతీ భవనం లేక దంతలబోరు ఎస్సీకాలనీ గ్రామపంచాయతీలో శనివారం సామాజిక తనిఖీ గ్రామసభను చెట్టుకిందనే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గద్దల రమేష్ మాట్లాడారు. నూతనంగా ఏర్పాటైన దంతలబోరు ఎస్సీకాలనీ గ్రామ పంచాయతీకి సొంత భవనం లేక గ్రామంలో అద్దెభవనం దొరకక మూడేళ్లుగా పంచాయతీ సమావేశాలు చెట్టు కిందనే నిర్వహించుకుంటూ ఇబ్బందులు పడుతున్నామన్నారు. పంచాయతీ భవనం మంజూరు చేయాలని అధికారులను, నాయకులను పలుమార్లు విన్నవించుకున్నా దళిత గ్రామమపంచాయతీని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బంగారు తెలంగాణలో అభివృద్ధి అంటే చెట్ల కింద గ్రామపంచాయతీ సమావేశం నిర్వహించుకోవడమేనా అని ప్రశ్నించారు. కలెక్టర్ మా దుస్థితిని అర్థం చేసుకుని పంచాయతీకి పక్కా భవనం మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో డీఆర్పీ రమ్యకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, టీఏ శ్రీను, ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్, ఉపసర్పంచ్ వెంకటనర్సమ్మ, వార్డు సభ్యులు శ్రీలత, లక్ష్మి, కోఆప్షన్ సభ్యురాలు లక్ష్మీదేవి పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికతో చదవాలి



షూస్ అందజేస్తున్న ఎంఈఓ శ్రీరామ్మూర్తి

పాల్వంచరూరల్: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకుంటే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని ఎంఈఓ శ్రీరామ్మూర్తి అన్నారు. మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలకు సొసైటీ నుంచి వచ్చిన షూస్‌ను శనివారం ఎంఈఓ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చదువులపై విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చదువులో సందేహాలు ఉంటే వెంటనే సంబంధిత ఉపాధ్యాయులను సంప్రదించి నివృత్తం చేసుకోవాలని సూచించారు. చదువుల తోపాటు విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నవభారత్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శ్యామ్‌సుందర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, ఉపప్రధానాచార్యులు ఆర్.రామకృష్ణ, పుల్లారెడ్డి, సరోజన, లక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణ, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుక



పూజలో పాల్గొన్న భక్తులు

పాల్వంచ: రథసప్తమి పండుగ సందర్భంగా శనివారం పట్టణంలోని శాస్త్రీరోడ్‌లోని శ్రీ సీతారామాలయంలో ప్రత్యే పూజలు నిర్వహించారు. ఆలయ వేద పండితులు శ్రీ గోపాల కృష్ణమాచార్యులు, శ్రీనివాసా చార్యులు ఆధ్వర్యంలో తెల్లవారుజామున 5గంటలకు ఆదిత్య హృదయ పారాయణంను సీతారామ సేవాదళ్ సభ్యులచే సంకల్పం చేయించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో కాశి, శివ, నరసమ్మ, చలువాది రాజ్యలక్ష్మి, అనిత, బిందు, కల్యాణి పాల్గొన్నారు.

సమయపాలన పాటించండి



విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న రాజేందర్‌నాయక్

టేకులపల్లి: ఏజెన్సీలో పని చేస్తున్న ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ గిరిజన విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడాలని దిశ కమిటీ జిల్లా కమిటీ సభ్యుడు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మాళోతు రాజేందర్‌నాయక్ అన్నారు. శనివారం ఆయన మండలంలోని సామ్యాతండా, తుమ్మలచెలక పాఠశాలలను సందర్శించారు. తుమ్మల చెలక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులకు ఒక్కరే ఉన్నారని, వంతుల వారీగా విధులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై కాంప్లెక్స్ హెచ్‌ఎం, ఎంఈఓల దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో చాలా మంది ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదన్నారు. సెలవులు, రిజిష్టర్ నిర్వహణ తదితర విషయాల్లో నిబంధనలు పాటించడం లేదని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు సమగ్ర విచారణ నిర్వహించిన తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

బీసీ కులగణన చేపట్టాలి

ఇల్లెందు: 74 ఏళ్ల స్వాతంత్ర భారతంలో బీసీలు దామాషా పద్ధతిన రిజర్వేషన్ సదుపాయాలు పొందలేకపోవటం దురదృష్టకరమని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాదావత్ ప్రతాప్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం బీఎస్పీ ఇల్లెందు నియోజకవర్గం కమిటీ ఆధ్వర్యంలో ఇల్లెందులోని జగదాంబా సెంటర్‌లో కోటి సంతకాల సేకరణ రెండో రోజు నిర్వహించారు. మాట్లాడుతూ.. అట్టడుగున ఉన్న బీసీలు అభివృద్ధి పథంలోకి రావాలంటే తక్షణమే పార్లమెంటులో బీసీ కులగణన బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. బీసీ కులగణన, 52శాతం రిజర్వేషన్ పెంపును డిమాండ్ చేస్తూ ఈ కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో బీసీలు అత్యధికంగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా కార్యదర్శి కాంతారావు, రాయల శ్రీనివాసరావు, సత్యనారాయణ, శ్రీనివాసరావు, జ్ఞాన సుందరం, రాంప్రసాద్,లోకేష్, కిరణ్, బట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి: రైతుల శ్రయస్సు కోసం సీఎం కేసీఆర్ ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని ఇల్లెందు ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని మిర్చితోటలను సందర్శించారు. కూలీలతో కలిసి మిర్చికాయలను కోస్తూ కూలీలు, రైతుల కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రైతుబంధు, రైతుబీమా, ఉచిత కరెంటు, తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. రైతు బంధుతో ఎకరానికి రూ.10వేలు పెట్టుబడి సాయంగా ఏడాదికి రెండు విడతలుగా అందజేస్తూ రైతులకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. ప్రమాదవశాత్తు రైతు మృతి చెందితే రైతు బీమా కల్పిస్తున్నాడని పేర్కొన్నారు. గతంలో వ్యవసాయం చేసుకోవాలంటే సాగునీటి సరఫరా లేక అన్నదాతలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేవారని, సకాలంలో పంటలు పండక దిగులు చెందేవారన్నారు. నేడు పాడి పంటలు పచ్చని పైర్లతో తెలంగాణ సస్యశ్యామలంగా మారిందన్నారు. కేసీఆర్ పథకాల వల్ల నేడు తెలంగాణ దేశానికే దిక్సూచిగా ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో బాణోతు హరిసింగ్‌నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మెర వరప్రసాద్, బయ్యారం మండల అధ్యక్షుడు తాతా గణేష్, బోడ బాలు, రామ, కిషన్, శివ, నరేష్, జేకే శ్రీను, బబ్లూ, కృష్ణ, అంతోటి రాకేష్, కాలె అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

హరిప్రియ ఫౌండేషన్ ఆస్పత్రి పరిశీలన

టేకులపల్లి: టేకులపల్లి మండలం గోలియాతండా గ్రామంలో హరిప్రియ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఆస్పత్రి నిర్మాణం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ మేరకు శనివారం ఇల్లెందు ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ ఆహ్వానం మేరకు జిల్లా ఆస్పత్రుల సమన్వయ కర్త (డీసీహెచ్‌ఎస్) డాక్టర్ రవిబాబు నాయక్, ఇల్లెందు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శిరీష్ ఉచిత ఆస్పత్రి భవనాన్ని సందర్శించారు. గదులను పరిశీలించారు. ఆస్పత్రి విధివిధానాలు, వైద్య సేవలు, సదుపాయాలు, సౌకర్యాల గురించి ఎమ్మెల్యే హరిప్రియ, ఆమె భర్త బాణోతు హరిసింగ్ నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు.

కార్యక్రమంలో వరప్రసాద్, బి.బాలు, లాల్‌సింగ్, దళపతి శ్రీనివాస్‌రాజు, నరేష్, బాలకృష్ణ, శివ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

త్వరలో అర్హులకు ఇళ్ల పట్టాలు

కొత్తగూడెంఅర్బన్: త్వరలో మిగిలి ఉన్న ఇంటిపట్టాలకు సర్వే టీమ్‌లు రాబోతున్నాయని, లబ్ధిదారులు సద్వినియోగించుకోవాలని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం పట్టణంలో ఎన్నో సంవత్సరాల నుంచి నివసిస్తున్న అనేక వేల మందికి 76 జీఓ ద్వారా ఇళ్ల క్రమబద్ధీకరణ చేసి పట్టాలివ్వడం జరిగిందని, అనంతరం రిజిస్ట్రేషన్ కూడా పూర్తి చేయించడం జరిగిందని వివరించారు. అనేక మంది పట్టణంలోని సింగరేణి భూమిలో 141, 142, 143 సర్వే నంబర్లలో నివసిస్తున్నారని, దీంతోపాటు వ్యాపారాలు చేసుకుంటున్నారని వివరించారు. అలాంటి వారికి సర్వే చేసి అర్హులైన వారికి 76 జీఓ ద్వారా న్యాయం చేసినట్లు తెలిపారు. ఇంకా కొంత మంది అర్హులైన వారు పట్టాలు పొందలేదని, వారు పట్టాలు పొందేందుకు 76 జీఓ ఆన్‌లైన్‌లో గడువు పెంచినట్లు పేర్కొన్నారు. రెండో విడతలో దాదాపుగా 1,536 మంది దరఖాస్తు చేసుకున్నారని, సర్వే టీంలు అన్ని వార్డులకు పంపించి ఎంక్వయిరీ చేయించడం జరిగిందని, ఈ సర్వేలో దాదాపుగా 450 మందిని మాత్రమే అర్హులుగా నిర్ణయించినట్లు తెలిపారు.

ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం: డీఎం



మాట్లాడుతున్న డీఎం వెంకటేశ్వరరావు

చుంచుపల్లి: ఆర్టీసీ బస్సులను ఆదరించాలని కొత్తగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ బి.వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం రుద్రంపూర్‌లో ప్రజలకు వద్దకు ఆర్టీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ ప్రయాణం సురక్షితం సుఖవంతంమైందన్నారు. వివాహాది శుభకార్యాలకు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. ఆర్టీసీ బస్ రిజర్వేషన్ సులువైన పద్ధతి ద్వారా సెల్‌లోనే చేసుకోవచ్చని వివరించారు. కొత్తగా కొత్తగూడెం డిపో నుంచి హైదరాబాద్, మియాపూర్ వయా రుద్రంపూర్, చంద్రుగొండ, ఎర్రగుంట మీదుగా బస్సు సౌకర్యాన్ని కల్పించామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆటో డ్రైవర్ల దోపిడీ ఎక్కువగా ఉందని కాకతీయ, సింగరేణి, తదితర ట్రిప్లకు మినీ లోకల్ బస్సులను ఏర్పాటు చేస్తే ఆదరిస్తామని డీఎంకు తెలిపారు. అలాగే సత్తుపల్లి, అన్నపురెడ్డిపల్లి, ఇతర ప్రాంతాలకు వెళ్లే పల్లెవెలుగు బస్సులను వయా రుద్రంపూర్ మీదుగా మళ్లిస్తే ఉయోగం ఉంటుందని డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో రుద్రంపూర్ సర్పంచ్ గుమ్మడి సాగర్, ఆర్టీసీ సిబ్బంది రాణి, సామ్యూల్ పాల్గొన్నారు.

జమునకు ప్రజానాట్య మండలి నివాళి



నివాళులర్పిస్తున్న ప్రజానాట్యమండలి కళాకారులు

సింగరేణి(కొత్తగూడెం): ప్రముఖ సినీ నటి, ప్రజానాట్య మండలి కళాకారిణి జమున శుక్రవారం హైదరాబాద్‌లో మృతి చెందిన సందర్భంగా శనివారం తెలంగాణ ప్రజానాట్య మండలి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. జిల్లా అధ్యక్షుడు సురేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రజానాట్యమండలి కార్యదర్శి వేముల కొండలరావు మాట్లాడుతూ.. తన చిన్ననాడే జమున ప్రజానాట్యమండలి వ్యవస్థాపకులు డాక్టర్ గరికపాటి రాజారావు అధ్వర్యంలో అనేక నాటకాలను ప్రదర్శించినట్లు చెప్పారు. ప్రముఖ బుర్రకథ కళాకారులు నాజర్‌తో కలిసి నటించిన జమున చిన్ననాడే ప్రజాకళలను, ప్రజానాట్య మండలి భావాలను పుణికి పుచ్చుకున్నారన్నారు. మాభూమి, ముందడుగు, ఎర్రమట్టి లాంటి తదితర నాటకాలలో ప్రముఖ హీరోయిన్ పాత్రను ధరించి ప్రజలను ఎంతో చైతన్య పరిచారని కొనియాడారు. నాటి కళాకారులైన మిక్కిలినేని, గుమ్మడి నాగభూషణ, అల్లు రామలింగయ్య, తదితర మహానటులతో ఆమె కళా జీవితం ప్రారంభమైందన్నారు. ప్రజానాట్యమండలిలో పనిచేసిన అనుభవంతోనే తాను సినీ రంగంలో సమస్యలను ధైర్యంగా ఎదుర్కొన్నానని జమున చెప్పేవారని గుర్తుచేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎస్ సురేందర్, కాటూరి రాము, జోగ శ్రీను, జి.సత్యం, వెంకటలక్ష్మి, మేదిని లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేలంపాట డబ్బు రికవరీ చేయండి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ కార్యాలయంలో జరిగిన డెయిలీ మార్కెట్ వేలంపాట దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇంత వరకు మున్సిపాలిటీకి డబ్బులు చెల్లించలేదని, రికవరీ చేయాలని కోరుతూ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రావి రాంబాబు, మున్సిపల్ మేనేజర్ సత్యనారాయణ శనివారం వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. గత ఏడాది ఆగస్టు నుంచి అమలులో ఉన్న డెయిలీ మార్కెట్‌కు వేలం దక్కించుకున్న కాంట్రాక్టర్ మాద శ్రీరాములు పాట పైకం చెల్లించలేదని, ఇంకా రెండు నెలలే కాలవ్యవధి ఉన్నందున మొత్తం రూ.51 లక్షలు రికవరీ చేయాలని కోరారు. ఈ విషయంలో మున్సిపల్ కమిషనర్‌ను రెండుసార్లు కలిశామని చెప్పారు. మూడోసారి వెళ్లగా వారు లేకపోవడంతో మున్సిపల్ మేనేజర్‌కి వినతిపత్రం అందజేసినట్లు వివరించారు. ఎవరెవరు మార్కెట్‌లో భాగస్వాములుగా ఉన్నారో వారందరూ కలిసి మున్సిపాలిటీకి కట్టవలసిన పైకాన్ని వెంటనే చెల్లించి బీఆర్ఎస్ పార్టీని, పాలకవర్గాన్ని విమర్శలపాలు చేయకుండా చూడాలని కోరారు.

అటెన్షన్ ప్లీజ్

రహదారికి మోక్షమెన్నడో...?

టేకులపల్లి మండలం తడికలపూడి నుంచి కోక్యాతండా వెళ్లే రహదారి ప్రమాదకరంగా ఉంది. అడుగడుగునా గుంతలతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా తయారైంది. ప్రభుత్వాలు మారినా ఈ గిరిజన పల్లెల్లో మాత్రం పక్కా రోడ్లకు మోక్షం లభించడం లేదు. ఈ మధ్య కాలంలో రోడ్డు మంజూరైనా పనులు ప్రారంభానికి ముహూర్తం కుదరడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి సత్వరమే బీటీ రోడ్డు నిర్మాణం చేపపట్టాలని స్థానికులు కోరుతున్నారు. - టేకులపల్లి



ప్రశ్నించాల్సిన అధికారి : రాజు,
ఏఈ, పీఆర్ టేకులపల్లి
సెల్ నంబర్ : 9676029621